# తప్పనిసరి అలలు

జీవితం హాయిగా గడిచి పోతోంది రామకృష్ణకు. పెద్దలు యిచ్చిన ఆస్తి పుష్కలమైన సుఖాలు అందజేస్తోంది. నమ్రత కలిగిన భార్య, అందమైన యిద్దరు పిల్లలు గృహంలో నిండు ఆనందం తొణికిసలాడిస్తున్నారు. ఉద్యోగంద్వారా సంపాదించే ఆదాయం స్నేహితులను పెంచి, రమ్యమైన సాంఘిక వాతావరణం ఏర్పరిచింది. ఇంక జీవితంలో ఏం కొరత అనుకున్నాడు రామకృష్ణ.

ఇంటికి వచ్చిన జ్యోతిష్కుడిని అడిగాడు. తన జీవితం యిలాగే గడుస్తుంది కదా అనే సంతృప్తితో ఇన్ని క్షేమైన హంగులు కలిగిన వాడి జీవితంలో ఆనందంకాక ఏముంటుం దనుకున్నాడు జ్యోతిష్కుడు. అతన్ని ఆశీర్వదించాడు.

పెరుగుతున్న ఆదాయాన్ని ప్రోగుచేసి ఘోషామహల్ లో ఒక పెద్ద మేడ కొన్నాడు. గృహప్రవేశం అఖండంగా జరిపాడు. స్నేహితులు, బంధువులు విందులు ఆరగించారు. శుభాకాంక్షలిచ్చారు.

మేడమీద నిలుచున్న రామకృష్ణకు చుట్టూ ఆవరించు కున్న ప్రపంచమంతా తన నయన పర్యవేక్షణలో, తనహస్తం పట్టులో ఉన్నట్టు కనిపించింది. మేడమీదకు విసిరే పిల్లగాలి రివ్వున అతని ప్రశాంత వదనానికి హాయి చేకూర్చింది. తనకు మూడవ శిశువు త్వరలో జన్మిస్తాడు. క్రొత్త యిల్లు కొన్నాక పుట్టబోయే కొడుకు జీవితానందానికి మరొక ప్రాతిపదిక.

వార్తాపత్రిక చూశాడు—రాజస్థాన్‌లో రైలు పట్టాలు తప్పింది. ఏభయిమంది చనిపోయారు, హాహాకారాలు... అస్సాంలో వరదలు...జనం నీళ్ళ ప్రవాహంలో కొట్టుకు పోయారు...పరకాల గ్రామంలో రెండు హత్యలు...చిత్రవధ చేయబడిన శవాలు దొరికాయి. నెంబరు కనిపించక పరీక్ష బాగా వ్రాసిన అబల నూతిలోపడి చనిపోయిన మర్నాడు వార్తాపత్రికలో ఆమె మొదటిక్లాసులో ప్యాసయినట్టు వార్త... జీవితంలోని విచిత్రాలు రామకృష్ణను కదిలించాయి. తన జీవితం మాత్రం ఒడుదుడుకులు లేకుండా గడుస్తూండటం... అదృష్టం అనుకున్నాడు.

పోస్టుమేన్ ఉత్తరం యిచ్చాడు. భార్య ప్రసవించింది... కొడుకు...రామకృష్ణ ఆనందం పట్టలేకపోయాడు...తల్లితో చెప్పాడు వార్త...రెండు రోజుల్లో బయలుదేరాడు అత్తవారి వూరికి...

తిరుపతి వెళ్ళాడు భార్యా పిల్లలతో...ఎత్తు కొండలు ఎక్కుతూంటే స్వర్గారోహణ చేసినట్లయింది...ఈ కొండల మెట్లు తిన్నగా ఆకాశంలోకి ఉంటే...ఉండవచ్చు...అదృశ్య మయిన మనుష్యులు యీ సోపానాలు ఎక్కడం పూర్తి చేయవచ్చు...నవ్వుకున్నాడు రామకృష్ణ.

గుడులు, గోపురాలు...దర్శించి యిల్లు చేరాడు. మాతృమూర్తి సంతోషంగా ఆహ్వానించింది కొడుకుని, కోడల్ని, క్రొత్త శిశువును...పిల్లవాడికి దిష్టి తగలకుండా దిగదుడిచింది... పిల్లవాడు బారసాల ఘనంగా చేయాలని తీర్మానం చేశారు.

బంధువులకు స్నేహితులకు ఆహ్వానాలు వెళ్లాయి. రెండురోజులు దాటితే యిల్లు జనంతో కలకలలాడుతుంది... ఘనమైన విందులు జరుగుతాయి.

రాత్రి చదువుకుంటూ కుర్చున్నాడు రామకృష్ణ... పదకొండు గంటలయింది. తల్లి, భార్య, పిల్లలు ఒక గదిలో పడుకున్నారు. గాఢ నిద్రలో ఉన్నారు...ప్రక్క గదిలోంచి తొంగి చూస్తున్న విద్యుద్దీపకాంతి ప్రతిఫలించగా చీకటిలో ప్రశాంతంగా ఉన్న వారి వదనాలు తిలకించాడు రామకృష్ణ... గృహంలో ఆనందం పొందినవాడు స్వర్గం చవిచూస్తాడు అనుకున్నాడు...

మెత్తటి పరుపుమీద ఒరిగాడు...కమ్మని కలలు... తెల్లవారుఝాము 5 గంటలయింది...మెలకువ వచ్చింది... ఆరుబయటకు వచ్చాడు...చీకటి. నీలాకాశంవైపు చూశాడు... అంతా నిశ్శబ్దం...రిక్షా మువ్వల చిన్న శబ్దాలు తప్ప... ధబేలున బ్రహ్మాండమైన చప్పుడయింది...ఉలిక్కిపడి ఆరుబయటనుంచి వెనక్కి చూశాడు...తనగదిలో వెలిగించిన విద్యుద్దీపం ఆరిపోయింది...రెండంతస్థుల మేడ కూలిపోయింది... గోడలు ముద్దయి తిరుపతి కొండలా పోగుపడింది...రామకృష్ణ నవనాడులు కృంగిపోయాయి...ఆరుబయట వరండాలో లైటు వేశాడు...కాని వెలగలేదు...అంతా చీకటి...తల్లీ, భార్య, పిల్లలు...పడుకొన్నగది యినుప దూలాలు గోడల కొండలతో క్రిక్కిరిసి పోయింది...నోటమాట పెకలలేదు...పోలీస్ స్టేషనుకు పరుగెత్తాడు సహాయం కోసం...ఆరు గంటలు దాటింది...

పోలీసులు వచ్చారు...అరుణోదయం కాంతిలో గోడల రాళ్లు... ఇనుప దూలాలు క్రమంగా బయటికి తీశారు...గోడల చిల్లుల సందుల్లోంచి కుంయ్ కుంయ్ అంటూ కుక్కపిల్ల బయటికి వచ్చింది...రామకృష్ణ చుట్టూ తోకాడిస్తూ తిరుగుతూ అరచింది...తన వాళ్ళు ప్రాణాలతో ఉన్నారో లేదో... శోకంతో దురపిల్లాడు...మంచాలు ఇనుప దూలంపాటుతో అణిగిపోయి విరిగిపోయాయి...శరీరాలు రక్తం ముద్దలుగా ఆకారాలు లేకుండా చితికిపోయాయి...భీభత్సదృశ్యం....శ్వాస ఆడుతున్న ఆఖరి శిశువు...హాస్పిటల్‌కు పంపుదామనుకుంటూంటే మరణించాడు...పూర్తి కుటుంబం నాశనమయింది... శోకం ఉబికి, పొంగి పొరలి రామకృష్ణ స్తంభించిపోయాడు... వలవల ఏడుస్తూ ఆవహించిన నీసరంతో కూలిపోయాడు... వచ్చిన పోలీసులు తమ విధ్యుక్త ధర్మం నిర్వహించి నయనా స్రుకణాలు రాల్చారు సానుభూతితో...

వార్త గుప్పున పొక్కింది...స్నేహితులు వచ్చారు... పరామర్శ చేశారు...కడుపుబ్బే శోకంతో వారందరికీ అంత్య క్రియలు చేశాడు రామకృష్ణ...

అంతా శూన్యంగా గోచరించింది...సగం కాలిపోయిన యింటిని మరే ప్రమాదం కలిగించకుండా స్థానిక పరిపాలకులు కూలద్రోశారు పూర్తిగా.

పన్నెండవ రోజున సంతర్పణ జరిగింది ఆ శిథిల గృహంలో...శిరోముండనం చేయించుకొని, కుంకంబొట్టు పెట్టుకొని, పంచ కట్టుకొని ఆఖరి ఖర్మకాండ చేస్తున్న రామకృష్ణ కట్టెలా కదిలాడు...

బిచ్చగాళ్లు అన్నదాత సుఖీభవ అన్నారు...

ఉద్యోగంకు రాజీనామా ఇచ్చాడు. యిల్లు వదిలేడు... తీర్థయాత్ర సేవించాడు...మనశ్శాంతి లభించలేదు...

భీకరఘోష పెట్టే సముద్రంవైపు చూశాడు. కెరటాలు పడుతున్నాయి, లేస్తున్నాయి జారుతున్న నీటిలో...అంతు దరిలేని మహాసముద్రం ఘోష పెడుతుంది...సూర్యకాంతిలో రంగులు మార్చుకుంటోంది సముద్రం...ఇసుక గట్టు మీద బొరియలు విడిచి గుంపులుగా నడుస్తున్న ఎర్రపీతలు–సముద్ర ఘోష ధ్వనులకు నృత్యం చేస్తున్నాయి. రామకృష్ణ ఒక దీర్ఘ నిశ్వాసం విడిచాడు...తాను కూడా ఈ అనంత జీవిన సముద్ర ఘోష ధ్వనులకు అనుగుణ్యంగా నృత్యం చెయ్యక తప్పదని పించింది మానవుడిగా బ్రతకాలంటే!

---